## జూపార్కుకు నేడు సెలవు లేదు

చాంద్రాయణగుట్ట, మార్చి 30 : నగరంలోని నెహ్రూ జులాజికల్ పార్కు సోమవారం రంజాన్ పండుగ రోజున తెరిచి ఉంటుందని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జూక్యూరేటర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8:30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జూ తెరిచి ఉంటుందని అన్నారు. సందర్శకులు, పర్యాటకులు జూ పార్కును సందర్శించవచ్చని అన్నారు.

## నేటితో ఓటీఎస్ గడువు పూర్తి

సిటీబ్యూరో, మార్చి 30 (నమస్తే తెలంగాణ ) ఆస్తిపన్ను బకాయిదారులపై జీహెచ్ఎంసీ స్పెషల్ డ్రైవ్ కొనసాగుతున్నది. బకాయిలను రాబట్టుకునేందుకుగానూ వన్ టైంసెటిల్‌మెంట్ (ఓటీఎస్)ను తీసుకువచ్చిన అధికారులు మొండి బకాయిదారులను గుర్తించి వారికి నోటీసులు అందజేసి వసూళ్లు చేస్తున్నారు. ఆర్థిక సంవత్సరం నేటితో ముగిస్తుండడంతో అధికారులంతా పండగ సెలవులు రద్దు చేసుకుని మరీ బకాయిదారులపై దృష్టి సారించారు. ఇందులో భాగంగానే 14.10 లక్షల మంది నుంచి రూ.1910 కోట్ల ఆదాయాన్ని రాబట్టుకున్నది. సోమవారం రాత్రి 11 గంటల వరకు సిటీజన్ సర్వీస్ సెంటర్లు పనిచేస్తాయని రూ.రెండు వేల కోట్లు దాటొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

## జీహెచ్ఎంసీలో ఇద్దరు డీసీలు బదిలీ

సిటీబ్యూరో, మార్చి 30 (నమస్తే తెలంగాణ ) జీహెచ్ఎంసీలో ఇద్దరు డిప్యూటీ కమిషనర్లను బదిలీ చేస్తూ కమిషనర్ ఇలంబర్తి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. సర్కిల్18లో పనిచేస్తున్న వి. ప్రశాంతిని సర్కిల్-20 శేరిలింగంపల్లికి బదిలీ చేశారు. సర్కిల్ 30 బేగంపేటలో పనిచేస్తున్న వి.సమ్మయ్యను జూబ్లీహిల్స్ సర్కిల్-18కి ట్రాన్స్‌ఫర్ చేశారు. సమ్మయ్యను వెంటనే రిలీవ్ చేయాలని సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కమిషనర్ ఆదేశించారు.

## టూరిజం అభివృద్ధిలో హోటల్స్ కీలక పాత్ర

హైదరాబాద్, మార్చి 30 (నమస్తేతెలంగాణ): దక్షిణాది రాష్ర్టాల్లో టూరిజం రంగ అభివృద్ధికి హోటల్స్ అసోసియేషన్ ముందుకు రావాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. సౌత్ఇండియా హోటల్స్ అసోసియేషన్, ఎఫ్‌హెచ్ఆర్ఎస్ అసోసియేషన్ అధ్యక్షులు విజయవాడ సీఎం క్యాంపు కార్యాలయంలో చంద్రబాబుతో సమావేశమయ్యారు. దక్షిణాదిలోని ఆరు రాష్ర్టాలకు చెందిన హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు హోటల్ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. హోటల్ పరిశ్రమకు ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తామని చంద్రబాబు వారికి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు సద్ది వెంకట్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ర్టాలకు చెందిన హోటల్స్, ఎఫ్‌హెచ్ఆర్ఎస్ అసోసియేషన్స్ అధ్యక్షులు ఉన్నారు.

## ఆకట్టుకున్న శ్రీకృష్ణ తులాభారం నాటకం

బంజారాహిల్స్, మార్చి 30 : ఉగాది పండుగ సందర్భంగా ఫిలింనగర్‌లోని ఫిలించాంబర్ రామానాయుడు కళామండపంలో ప్రతియేటా నిర్వహించే ఉగాది నాటకోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నాటకోత్సవాల్లో భాగంగా మొదటి రోజు కళాకారులు శ్రీకృష్ణ తులాభారం నాటకాన్ని ప్రదర్శించారు. శ్రీ వెంకటలక్ష్మీ దుర్గా నాట్యమండలి తెనాలి బృందం నిర్వహించిన శ్రీకృష్ణ తులాభారం నాటిక అత్యంత ఆసక్తికరంగా సాగింది. శ్రీకృష్ణుడిగా డాక్టర్ ఎ. కోటేశ్వర్‌రావు, సత్యభామగా నంది అవార్డు గ్రహీత రత్నశ్రీ, రుక్మిణిగా సురభి వెంగమాంబ, నారధుడిగా షణ్ముఖి విజయకుమార రాజు ప్రధాన పాత్రలలో రక్తి కట్టించారు.

# అంచనాలు తలకిందులు!

## రూ.500కోట్లకు గానూ రూ.112 కోట్లు మాత్రమే ఆదాయం

- జీహెచ్ఎంసీలో రుసుం నిర్ధారణకు నోచుకోని 49,342 దరఖాస్తులు
- నేటితో ముగియనున్న ఎల్ఆర్ఎస్ గడువు



సిటీబ్యూరో, మార్చి 30 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీలో ఎల్ఆర్ఎస్ అంచనాలు తప్పాయి. ప్లాట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తుదారులు ఆశించిన స్థాయిలో ముందుకు రాలేదు. వచ్చిన దరఖాస్తుల్లో ఇప్పటి వరకు 8704 మంది మాత్రమే ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకున్నారు. లక్షా 7వేల దరఖాస్తులను స్వీకరించగా 8704 మంది నుంచి రూ.112 కోట్లు ఆదాయాన్ని జీహెచ్ఎంసీ సమకూర్చుకున్నది. ఈ నేపథ్యంలోనే ఎల్ఆర్ఎస్ ద్వారా రూ.500కోట్ల అదాయం వస్తుందని అధికారులు అంచనా తలకిందులయ్యాయి. జోనల్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు, దరఖాస్తుదారులకు ఫోన్లు చేసి రుసుం చెల్లించాలని కోరినా ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. కాగా నేటితో 25శాతం రాయితీ గడువు ముగుస్తుండడం, మరికొందరు లబ్ధిదారులు గడువు పెంచుతారన్న ఆశగా ఎదురుచూస్తున్నారు.

జీహెచ్ఎంసీ పరిధిలో 1.07 లక్షల దరఖాస్తులు రాగా, రుసుం చెల్లించేందుకు జనరేటైన దరఖాస్తులు 58,523 మాత్రమే. మొత్తం దరఖాస్తుల్లో ఇది 54 శాతం. మరో 49,342 దరఖాస్తులకు రుసుం నిర్ధారణ జరగలేదు. ఇందులో మెజార్టీ ప్రభుత్వ వక్ఫ్ వంటి నిషేధిత భూములు చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నవిగా భావిస్తున్నారు. చెరువులు, కుంటల పక్కన 200 మీటర్ల దూరంలో ఉన్న ప్లాట్లను పక్కన పెట్టారు. నిబంధనల ప్రకారం 25 ఎకరాలలోపు విస్తీర్ణంలో ఉన్న చెరువుకు 30 అడుగులు ( 9 మీటర్లు), 25 ఎకరాల విస్తీర్ణం కంటే ఎక్కువ ఉన్న చెరువులకు 100 అడుగులు ( 30 మీటర్లు) ఎఫ్‌టీఎల్‌గా నిర్ధారించారు. అయితే ఎల్ఆర్ఎస్ మార్గదర్శకాల్లో మాత్రం చెరువులకు 200 మీటర్ల వరకు ఉన్న ప్లాట్ల దరఖాస్తులను పక్కన పెట్టాలని పేర్కొన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం ఆ దరఖాస్తుల విషయంలో నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు. రుసుం నిర్ధారణ జరిగిన దాదాపు 30 శాతం దరఖాస్తులకు సంబంధించి ఇప్పటికే భవన నిర్మాణ అనుమతులు జారీ అయ్యాయని, పర్మిషన్లు ఇచ్చే సమయంలో ఎల్ఆర్ఎస్ రుసుం వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు.

# ఎల్ఆర్ఎస్‌కు స్పందన కరువు

- అవగాహన లోపం.. అధికారుల నిర్లక్ష్య వైఖరితో
- గడువు ముగిసినా నేరవేరని లక్ష్యం
- నేటితో ముగియనున్న 25శాతం రాయితీ గడువు

మేడ్చల్, మార్చి30 (నమస్తే తెలంగాణ): ఎల్ఆర్ఎస్‌కు స్పందన కరువైంది. గడువు ముగుస్తున్నా లక్ష్యం మాత్రం నేరవేరలేదు. ప్రభుత్వ భూముల్లో అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ ఎల్ఆర్ఎస్ ప్రక్రియకు ఆశించిన మేరకు స్పందన రాలేదు. దీనికి అధికారుల నిర్లక్ష్యం వల్లే దరఖాస్తుదారుల్లో అవగాహన లేకపోవడమే కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వానికి ఆశించిన స్థాయిలో ఆదాయం వచ్చే అవకాశం లేకుండా పోయింది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగించకపోవడంతో పాటు ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా లక్ష్యాన్ని చేరుకోవడంలో విఫలమైనట్లు తెలుస్తోంది. జిల్లాలో ఎల్ఆర్ఎస్ రాయితీకి 30 శాతానికి మాత్రమే పరిమితమైంది.

### జిల్లాలో 1,63 లక్షల దరఖాస్తులు.. ఫీజు చెల్లించింది 31 వేలే!

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 1.63 లక్షల ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు రాగా 31 వేల దరఖాస్తుదారులు మాత్రమే క్రమబద్ధీకరణకు ఫీజు చెల్లించారు. దీంతో జిల్లాలో 30 శాతం మాత్రమే సద్వినియోగం చేసుకున్నారు. సుమారు లక్షకు పైగా దరఖాస్తుదారులు ముందుకు రాకపోవడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమనే ఆరోపణలున్నాయి. 25 శాతం రాయితీ ఇచ్చినా ముందుకు రాలేకపోడానికి అవగాహన లోపం ఓ కారణంగా చెబుతున్నారు. నేటితో రాయితీ గడువు ముగుస్తున్న క్రమబద్ధీకరణకు సుమారు 78 వేల మంది ఫీజు చెల్లించాల్సి ఉంది. అయితే గడువు ముగిస్తే వీరి పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నర్థకరంగా మారింది. అయితే ప్రభుత్వం గడువు పొడిగించే అవకాశం కల్పిస్తుందా? రాయితీ ఇస్తుందా! లేదా వేచి చూడాల్సిందే. కాగా కొందరికి చేతిలో డబ్బులు లేకపోవడంతో చెల్లించలేపపోయినట్లు దరఖాస్తుదారులు తెలిపారు.

# ఈ సారి గరుడ ప్రసాదం లేదు

## ఆలయ ప్రధాన అర్చకులు సీఎస్ రంగరాజన్



చిలుకూరు బాలాజీ ఆలయంలో బ్రహ్మోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అర్చకులు

మొయినాబాద్, మార్చి 30 : చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతి సంవత్సరం వితరణ చేసే గరుడ ప్రసాదాన్ని ఈ సంవత్సరం పంపిణీ చేయడం లేదని చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకులు సీఎస్ రంగరాజన్ అన్నారు. ఆదివారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధి చిలుకూరు బాలాజీ ఆలయంలో ఉగాది పండుగ సందర్భంగా పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగరాజన్ మాట్లాడుతూ గరుడ ప్రసాదానికి ప్రతి ఏడాది భక్తుల తాకిడి విపరీతంగా పెరిగిందని, ఈ నేపథ్యంలో చాలా మంది భక్తులు ప్రసాదం కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా సులభతరమైన పద్ధతిలో ప్రసాదాన్ని వితరణ చేయాలని వచ్చి అభిప్రాయాల మేరకు బ్రహ్మోత్సవాల్లో కాకుండ ఇతర రోజుల్లో ప్రసాదాన్ని పంపిణీ చేయాలని నిర్ణయించామన్నారు. దానికి ప్రత్యామ్నాయంగా ప్రతి నెలలో వచ్చే శుక్రవారాల్లో అభిషేకం ప్రసాదాన్ని గరుడ ప్రసాదంగా గత ఏడాది నుంచి ఇచ్చుకుంటూ వస్తున్నామని తెలిపారు. ఇదే విధంగా ఈ ఏడాది కూడ కొనసాగిస్తామని చెప్పారు. ఏప్రిల్ మాసంలో కాకుండా మే నెల నుంచి ప్రతి నెల శుక్రవారాల్లో గరుడ ప్రసాదాన్ని వితరణ చేస్తామని అన్నారు. భక్తుల తాకిడి నేపథ్యంలో ఈ నిర్ణయానికి వచ్చామని భక్తులు అర్థం చేసుకోవాలని సూచించారు. విశ్వావసు నామ సంవత్సరంలో వర్షాలు బాగానే కురుస్తాయని.. ఈ ఏడాది అంతా బాగుంటుందన్నారు. అనంతరం బహ్మోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాలకృష్ణస్వామి, ఆలయ ప్రధాన అర్చకులు సీఎస్ రంగరాజన్‌స్వామి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గుండు గోపాల్‌ముదిరాజ్, స్వామి భక్తుడు పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.





ఉగాది పర్వదినం సందర్భంగా నగరంలో పలు చోట్ల పంచాంగ శ్రవణం జరిగింది. భక్తులు ఆలయ సందర్శన చేశారు. ఈ క్రమంలో మాదాపూర్‌లోని శిల్పారామంలో పంచాంగ శ్రవణం చేసిన ప్రొఫెసర్ కమలాకర శర్మ, శిల్పారామం ప్రత్యేక అధికారి కిషన్‌రావు. (పక్కన ) సికింద్రాబాద్ మహంకాళీ ఆలయంలో, మూల విరాట్టులను ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం

# ఫిర్యాదులపై చర్యలేవి ?

**నాణ్యమైన వైద్యం అందడం లేదంటూ మెడికల్ కౌన్సిల్‌లో బాధితుల ఫిర్యాదులు**
**చర్యలకు ఉపక్రమించని మెడికల్ కౌన్సిల్**

సిటీబ్యూరో, మార్చి30 (నమస్తే తెలంగాణ): వరంగల్‌కు చెందిన 30 ఏళ్ల కృష్ణ, 2024 జులైలో అపెండెసిస్ సమస్యతో బాధ పడుతూ.. వరంగల్‌లోని బంధన్ ప్రైవేట్ దవాఖానలో చేరాడు. అక్కడ శస్త్ర చికిత్స చేయించుకోగా.. వికటించింది. వెంటనే హైదరాబాద్‌లోని మరో ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లగా వారు అధిక సొమ్ము డిమాండ్ చేశారు. అప్పటికే మొదటి శస్త్ర చికిత్స సరిగ్గా చేయకపోవడంతో మంచానికే పరిమితమయ్యాడు. తనకు జరిగిన చికిత్స పై అనుమానంతో ఆపరేషన్ థియేటర్‌లో తీసిన వీడియో కావాలని ఆసుపత్రిని సంప్రదించగా సిబ్బంది స్పందించలేదు. తనకు న్యాయం జరగాలని, ఆ వైద్యశాలపై చర్యలు తీసుకోవాలని 2024 డిసెంబర్ లో మెడికల్ కౌన్సిల్ లో ఫిర్యాదు చేశాడు. ఇప్పటి వరకు ఆ కేసు పురోగతిలో లేకపోవడం గమనార్హం.

### 2024లోనే 31 కేసులు నమోదు..

నాణ్యమైన వైద్యం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులపై రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదులు అందుతున్న తరుణంలో వాటిని పరిష్కరించేందుకు మెడికల్ కౌన్సిల్ చర్యలు తీసుకోవడం లేదు. పెండింగ్ కేసులను పరిష్కరించడంలో ఇంకా వెనుకబాటుతోనే ఉంది. 2019 నుంచి ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా నాణ్యమైన వైద్యం అందించలేదని పలువురు వైద్యులపై 95 కేసులు నమోదయ్యాయి. ఒక్క 2024 ఏడాదిలోనే 31 కేసులు కేవలం బాధితుల నుంచే వచ్చాయంటే వైద్యం ఏ స్థాయిలో అందుతుందో అర్థం చేసుకోవచ్చు. వైద్యపరమైన నైతికత , నిర్లక్ష్యం, అక్రమ వైద్యం, అర్హతలేకుండా వైద్యం అందిస్తే మెడికల్ కౌన్సిల్ కొరడా ఝులిపిస్తుంది. రోగికి సరైన వైద్యం అందించకపోవడం, తప్పుడు చికిత్స అందించడం, అవసరమైన పరీక్షలు, వైద్య పద్ధతులు పాటించకుండా అనవసరమైన తప్పిదాలు చేయడం, శస్త్రచికిత్సల్లో ఘోరమైన తప్పిదాలు, సరైన అర్హతలు లేకుండా వైద్యం చేయడం, నకిలీ డిగ్రీలు పొందిన వైద్యులు, అనుమతి లేని లేదా నిషేధిత మందులు వాడడం వంటి ఫిర్యాదుల్లో నిత్యం బాధితులు మెడికల్ కౌన్సిల్ కార్యాలయంలో వినతులు ఇస్తున్నారు. అధికారులు స్వీకరిస్తున్నారు. కానీ సకాలంలో చర్యలు చేపట్టడం లేదన్నది బాధితుల నుంచి వినిపిస్తున్న వాదన.

### జాప్యం వల్ల వారికే మేలు..

బాధితుల నుంచి అందిన ఫిర్యాదులను మెడికల్ కౌన్సిల్ సకాలంలో పరిష్కరించకపోవడం మూలాన నకిలీ వైద్యులు, నాణ్యమైన వైద్య సేవలందించని పలు ఆసుపత్రులవాళ్లు మరింతగా రెచ్చిపోతూ ప్రజల ప్రాణాలతో చలగాటమాడుతున్నారు. తప్పులు చేసినా శిక్షలు పడవనే ధీమా వాళ్లలో ఎక్కువైంది. మరోవైపు వైద్యం పేరుతో అధిక ఫీజులు వసూల్ చేస్తూ అందిన కాడికి దండుకుంటున్నారు. ఒకవైపు నిర్లక్ష్యపు వైద్యం, మరోవైపు చర్యలు తీసుకోలేని మెడికల్ కౌన్సిల్ తీరు పట్ల సామాన్యులు అసహనంతో ఉన్నారు.

## క్రిమినల్స్‌తో కలిసి అక్రమ వ్యాపారాలా!

### ఇద్దరు ఏసీపీలపై సీపీ ఆగ్రహం

సిటీబ్యూరో, మార్చి 30 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో పోలీసుల తీరు ఎప్పుడూ చర్చనీయాంశమవుతోంది. ఇటీవల వెస్ట్ జోన్‌లో ఇద్దరు ఇన్‌స్పెక్టర్ల వ్యవహారశైలి ఠాణాకు చెడ్డ పేరు తెస్తుందంటూ సీపీ సీవీ ఆనంద్ బదిలీపై పంపించారు. ఇప్పుడేమో ఏకంగా ఇద్దరు ఏసీపీలు క్రిమినల్స్‌తో కలిసి వ్యాపారాలు చేస్తున్నారంటూ వారిని పిలిచి సీరియస్‌గా మందలించారు. నార్త్ జోన్‌లో ఒకరు, ఈస్ట్‌జోన్‌లో ఒక ఏసీపీ ఈ అక్రమ దందాలకు పాల్పడుతున్నట్లుగా సమాచారం. దీనిపై ఎబీ రిపోర్ట్ తీసుకున్న సీపీ ఇటీవల కొన్ని కేసుల్లోనూ ఆ ఇద్దరు అధికారులు సెటిల్‌మెంట్లు బాగానే చేస్తున్నట్లుగా తన దృష్టికి వచ్చిందని, ఈ విషయంలో సహించేదే లేదంటూ వార్నింగ్ ఇచ్చారు. క్రిమినల్స్ చేస్తున్న వ్యాపారాల్లో మీకు భాగస్వామ్యం ఏంటంటూ విడివిడిగా ఆ ఏసీపీలను సీపీ అడిగినట్లు సమాచారం. వ్యాపారాల విషయంలో పూర్తి నివేదిక తెప్పించుకున్న తర్వాత వీరిపై యాక్షన్ తీసుకోవడానికి సీపీ సిద్ధమయ్యారు.



## వెంకటేశ్వరశర్మకు ఉగాది పురస్కారం

సిటీబ్యూరో, మార్చి30,(నమస్తే తెలంగాణ): విశ్వావసు నామ సంవత్సర పర్వదినం సందర్భంగా ఆదివారం రవీంద్రభారతీలో శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజారామయ్యర్, రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ కమిషనర్ శ్రీధర్ పాల్గొన్నారు.

## రవీంద్రభారతిలో ఘనంగా ఉగాది వేడుకలు



వేద పండితులను సన్మానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కొండ సురేఖ, జూపల్లి కృష్ణారావు

రవీంద్రభారతి, మార్చి30: రాష్ట్ర ప్రజలకు విశ్వావసు నామ సంవత్సరంలో సుఖసంతోషాలతో ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలోని మెయిన్ హాల్‌లో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, దేవాదాయ శాఖామంత్రి కొండ సురేఖ,ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్, శంకరయ్య, మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనంతరం పలువురికి ఉగాది పురస్కారాలు అందజేశారు.

## 120 కిలోల బండరాయిని ఎత్తిన మొనగాళ్లు



హమాలిబస్తీలో 120 కిలోల బండరాయిని ఎత్తిన యువకులు

బన్సీలాల్‌పేట్, మార్చి 30: పద్మారావునగర్‌లోని హమాలిబస్తీలో కూలి పనిచేసే పాలమూరు యువకులు ప్రతి ఏడాది ఉగాది పండుగ రోజున బలప్రదర్శనలో పాల్గొంటారు. ఇందులో భాగంగా 120 కిలోల బరువున్న బండరాయిని ఎత్తిన వారిని మొనగాళ్లుగా ప్రకటించి సన్మానిస్తారు. పాలమూరులోని ప్రస్తుతం నారాయణపేట్ జిల్లా దామరగిద్ద ప్రాంతానికి చెందిన ఎం.విజయ్, శ్రీనివాస్, హనుమదాస్, ఖలీల్, కర్నాటకలోని సేడంకు చెందిన శివ, శ్రీనివాస్, షాను, భాస్కర్‌లు 120 కిలోల బరువు కలిగిన గుండ్రటి బండరాయిని విజయవంతంగా భుజంపైకి ఎత్తుకుని విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా హమాలిబస్తీ నాయకులు యాదగిరి, రవి, శ్యామ్, సాయిరామ్, పాష, గోవింద్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు, అంబులెన్స్ సురేశ్, ముక్కశ్రీను, సుధాకర్‌రెడ్డి, సురేశ్, లక్ష్మారెడ్డిలు విజేతలుగా నిలిచిన యువకులను సన్మానించి అభినందించారు.

## ఉపాధ్యాయులను కించపరిచే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడటం సిగ్గు చేటు

కీసర, మార్చి 30 : సీఎం రేవంత్‌రెడ్డి ఉపాధ్యాయులను కించ పరిచే విధంగా మాట్లాడటం సిగ్గు చేటుగా ఉందని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అధ్యక్షులు రామినేని వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి లచ్చుమల్ల వెంకన్నలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసెంబ్లీలో విద్యాశాఖ బడ్జెట్‌పై జరిగిన చర్చలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉపాధ్యాయులను కించ పరిచే విధంగా మాట్లాడటం సరికాదని అన్నారు. ఉపాధ్యాయులు సంవత్సరంలో కేవలం సగం రోజులే పనిచేస్తున్నారని జీతాలు మాత్రం సంవత్సరానికి తీసుకుంటున్నారని మాట్లాడటం సరికాదని మేము కూడా మిగతా ఉద్యోగుల లాగే పని చేస్తున్నామని కేవలం మనో విజ్ఞాన శాస్త్రం ప్రకారం విద్యార్థులకు సెలవులు ఇస్తారని ఆ సమయంలో కూడా మేము ఎల్లప్పుడు ప్రభుత్వానికి అందుబాటులోనే ఉంటున్నామని తెలిపారు. మీరు ఒకవేళ పిల్లలకు ఎలాంటి సెలవులు ఇవ్వకుండా బోధన సాగించే విధంగా అకాడమిక్ క్యాలెండర్‌ను రూపొందించి ఇస్తే ఆ విధంగా పనిచేయడానికి ఉపాధ్యాయులమంతా సిద్ధంగా ఉన్నామన్నారు. మిగతా ఉద్యోగులు మాకంటే 30 రోజులు ఎక్కువగా పనిచేస్తారని అందుకు తగ్గట్టుగానే వారికి 30 సంపాదిత సెలవులు కూడా ప్రభుత్వం ఇస్తున్న విషయం ముఖ్యమంత్రికి తెలియనిది కాదని, విద్యాశాఖను కూడ నాన్ వేకేషన్ శాఖగా మార్చి పిల్లలకు ఎలా బోధన చేయాలో నూతన శిక్షణ కార్యక్రమాలకు ప్రణాళికలను రూపొందించాలని డిమాండ్ చేశారు.

## ఆచార్య దార్లకు ఏపీ ప్రభుత్వ ఉగాది పురస్కారం



ఏపీ సీఎం నుంచి ఉగాది పురస్కారాన్ని అందుకుంటున్న ఆచార్య దార్ల

కొండాపూర్, మార్చి 30 : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు శాఖ ప్రొఫెసర్ దార్ల వెంకటేశ్వరరావు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా ఉగాది పురస్కారంతో సత్కరించింది. ఆదివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు చేతులమీదుగా ఈ పురస్కారాన్ని ఆయన అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కోనసీమ జిల్లాకు చెందిన ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కవిగా ఆయన 'దళిత తాత్వికుడు', 'నెమలి కన్నులు' కవితా సంపుటాలను, 'వీచిక' సాహిత్య విమర్శ వ్యాసాలు, 'బహుజన సాహిత్య దృక్పథం', 'పునర్మూల్యాంకనం' 'సాహితీసు లోచనం' ఆత్మకథ 'నెమలికన్నులు' తదితర గ్రంథాలు రచించారు. ఈ అవార్డు పురస్కారం రావడం పట్ల హెచ్ సీయూ తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య పిల్లలమర్రి రాములు అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.